# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో లక్షా 35 వేల 964 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు ఈ సాయంత్రం భూమిపూజ నిర్వహించారు.
- ❖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి హెచ్.డి. కుమారస్వామి పేర్కొన్నారు.
- ❖ ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు.
- ❖ వంట గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్యాస్ కొరతను అధిగమించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కె. పార్ధసారధి స్పష్టం చేశారు.

====================

అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో లక్షా 35 వేల 964 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు ఈ సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్ డీ కుమారస్వామి, ఆ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్సెలార్ మిట్టల్ అధినేత లక్ష్మీ మిట్టల్, కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు, స్టీల్ ప్లాంట్ నిర్మాణ నమూనాను లక్ష్మీ మిట్టల్ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులకు వివరించారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని, నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

====================

ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ భూమిపూజ కార్యక్రమం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ పారిశ్రామిక రంగం నూతన పుంతలు తొక్కుతోందని కుమారస్వామి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

అదే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారబోతోందని చెప్పారు. ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో భాగంగా ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతుందని ముఖ్యమంత్రి వివరించారు.

(వాయిస్ 32 సెకన్లు)

====================

ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కోనేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దీనికి పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ), విద్యుత్ పరికరాల వినియోగం పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాలతో తలెత్తిన పంట నష్టంపై అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణ కోసం 2 లక్షల 34 వేల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ 60 వేల మంది వినియోగదారులు మాత్రమే కనెక్షన్లు పొందారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిని నూరు శాతం వినియోగించుకునేలా చూడటంతో పాటు.. జిల్లాకు కనీసం 10 వేలకు తగ్గకుండా నూతన కనెక్షన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీకాకుళం - కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణపై కేంద్రమంత్రికి లేఖ రాయాలని చెప్పారు. వచ్చే మంత్రివర్గ సమావేశానికి 'నేచురల్ గ్యాస్ పాలసీ ఫర్ ప్రమోషన్ ఇన్ కమర్షియల్ సెక్టార్' విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. అదే విధంగా అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన పంట నష్టం ప్రాథమిక వివరాలపైనా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు.

విరామం

====================

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేసిన విషయాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ...వంట గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఏర్పడిన వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఇండక్షన్ స్టవ్ లను వాడేలా చేయడం, కంపెనీలు వాటి ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. పైప్ లైన్ గ్యాస్ (పీఎన్జీ) సరఫరా విధానాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోకుండా రైతులకు ముందస్తు సందేశాలను పంపి అప్రమత్తం చేశామని మంత్రి పార్థసారథి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్. డి. కుమారస్వామి ఈరోజు విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ ను సందర్శించి, ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం, పనితీరును సమీక్షించారు. సంస్థ యాజమాన్యంతో సమీక్ష నిర్వహించిన ఆయన ముడి పదార్థాల సరఫరా, ప్లాంట్ మౌలిక సదుపాయాల మెరుగుదలపై చర్చించారు. అదే విధంగా

కార్మిక సంఘాలతో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. బ్లాస్ట్ ఫర్నేస్, కోక్ ఓవెన్ విభాగాలను పరిశీలించి, కార్మికుల పనితీరును అభినందించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై భయపడాల్సిన అవసరం లేదని, ప్లాంట్ పునరుద్ధరణకు, బలోపేతానికి చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి హెచ్.డి. కుమారస్వామి హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో పాటూ స్థానిక పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పాల్గొన్నారు.

====================

కాకినాడ జిల్లా సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్, వివిధ శాఖల అధికారులతో పాటూ స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధి సమీక్షలో తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను కలెక్టర్ షణ్మోహన్ మంత్రికి వివరించారు. అనంతరం అజెండా అంశాలుగా వ్యవసాయం, ధాన్యం సేకరణ, నీటి పారుదల, విద్యుత్, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలపై మంత్రి నారాయణ అధికారులతో సమీక్షించి ఆయా లక్ష్యాల సత్వర సాధనకు చర్యలు చేపట్టలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... గత ఖరీఫ్ సీజనులో రైతులకు మద్దతు ధర కల్పిస్తూ ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని చెప్పారు. పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకూ 6 వేల 763 కుటుంబాలు ఇంటి కప్పులపై సోలార్ విద్యుత్ పానెళ్లు ఏర్పాటు చేసుకున్నాయని తెలియజేశారు. లెగసీ వ్యర్థాల తరలింపు ప్రక్రియ జిల్లాలోని కాకినాడ, ఏలేశ్వరం పట్టణాల్లో ఇంకా పూర్తి కావలసి ఉందని, జూన్ నెలలోపు ఈ వ్యర్థాల తొలగింపు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు.

====================

విశాఖ జిల్లాలో మార్చి నెల ఆఖరు నాటికి ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నెల నుంచి జనగణన-2027 ప్రక్రియ మొదలవుతుందని, ఈ లోగా ఓటర్ల జాబితాలకు సంబంధించిన పనులను పూర్తి చేసుకోవాలని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు కింది స్థాయి అధికారులతో, సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

====================
====================